క్లుప్తంగా

పితాని బాలకృష్ణకు సత్కారం


పితాని బాలకృష్ణను సత్కరిస్తున్న శెట్టిబలిజ నాయకులు

తాళ్లరేవు: ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన పితాని బాలకృష్ణను తాళ్లరేవు మండల శెట్టిబలిజ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనును దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. సత్కరించిన వారిలో రెడ్డి సతీష్, కొప్పిశెట్టి వెంకట్, మట్టపర్తి లోవరాజు, పంపన రామకృష్ణ, బొంతు మోహన్, గుత్తుల శ్రీను, కాలా వెంకట రమణ, కడియాల శ్రీను, దెయ్యాల సత్తిబాబు తదితరులున్నారు.

జనసేనకు శ్రీనుబాబు రాజీనామా


సందాడి శ్రీనుబాబు

అల్లవరం: మండల జనసేన నాయకుడు సందాడి శ్రీనుబాబు ఆ పార్టీకి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు పంపించారు. అల్లవరం మండలం గోడితిప్ప గ్రామానికి చెందిన శ్రీనుబాబు జనసేన పార్టీలో శెట్టిబత్తుల రాజబాబు శిష్యుడిగా పేరొందారు. జనసేన టిక్కెట్టు దక్కకపోవడంతో రాజబాబు పార్టీకి రాజీనామ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రాజబాబు దారిలోనే ఆయన శిష్యుడు శ్రీనుబాబు రాజీనామా చేయడంతో మండలంలో జనసేన దాదాపుగా ఖాళీ అయ్యింది.

జాతర ప్రారంభం


గంగాలమ్మ అమ్మవారు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు శివారు రంగనాయకపురం గ్రామ దేవత గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన జాతర, 9వ తేదీన తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

8న ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

యానాం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారికి తమిళనాడు కాంచీపురంలోని ఎల్అండ్‌టీ(లార్సెన్ అండ్ టుబ్రో) కంపెనీ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో మూడు నెలల పాటు ఎలక్ట్రికల్, వెల్డింగ్, ప్లంబింగ్ తదితర ట్రేడుల్లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం ఎల్అండ్‌టీ కంపెనీల్లో ఉపాధి కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు జాబ్ మేళాలో పాల్గొనొచ్చన్నారు.

ఉగాది వేడుకలకు ఆహ్వానం


దొండపాటి నాగజ్యోతి

ఐ.పోలవరం: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు తనకు ఆహ్వానం అందిందని మురమళ్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు, కవయిత్రి దొండపాటి నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. మెరినా తీరంలో మద్రాసు విశ్వవిద్యాలయ రజతోత్సవ ప్రాంగణంలో ఈ నెల 5 నుంచి జరగనున్న ఈ వేడుకలకు దేశంలో 60 మంది కవులను ఆహ్వానించారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నాగజ్యోతిని ఉపాధ్యాయులు వి.సురేష్‌బాబు, ఎ.సూర్యమోహన్, వీవీవీ సుబ్రహ్మణ్యం, ఉందుర్తి వెంకట్రావు తదితరులు అభినందించారు.

ఓటర్లు అధికారిక గుర్తింపు కార్డు చూపించాలి

యానాం: ఈ నెల 19న పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికల్లో ఓటేసేందుకు ఓటర్లు తమ ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డును గుర్తింపుగా చూపించొచ్చని, అది లేకపోయినా మిగిలిన 12 రకాల అధికారిక గుర్తింపు కార్డుల్లో ఏదొకటి చూపించినా సరిపోతుందని రిటర్నింగ్ అధికారి కుళోత్తుంగన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జాబ్‌కార్డు, ఫొటో ఉన్న బ్యాంక్ పాస్‌బుక్, పోస్టాఫీసు బుక్, కార్మికశాఖ పథకంలోని హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ ఆధ్వర్యంలో ఆర్‌జీఐ విడుదలచేసిన స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, సెంట్రల్, స్టేట్, పీఎస్‌యూ, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఫొటోతో జారీ చేసిన సర్వీసు ఐడెంటిటీ కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీచేసిన అధికారిక గుర్తింపు కార్డులు ఉపయోగించి సైతం ఓటు వేయవచ్చన్నారు.

పింఛన్‌దారులపై చంద్రబాబు కక్ష సాధింపు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- సరిపల్లి, గోపవరంలో ఎన్నికల ప్రచారం


సరిపల్లిలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్


గోపవరంలో మంత్రి విశ్వరూప్‌కు హారతులిస్తున్న మహిళలు

ఉప్పలగుప్తం: దివ్యాంగులు, వయోవృద్ధులతో సహా పింఛన్‌దారులందరిపై చంద్రబాబు కక్ష సాధిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం నియోజవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని సరిపల్లి, గోపవరం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు ఆయనకు హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు. ఆయన ప్రతి ఇంటికి వెళ్లి జగన్ ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. అర్హులైన ప్రతి ఇంటికి మెరుగైన ప్రభుత్వ సేవలు అందాలనే సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి తీసుకెళ్లి మరీ పింఛన్లను అందజేసేవారని, అయితే ఇంటివద్దకే పింఛను అందకుండా చేసిన పాపం చంద్రబాబుదేనని విమర్శించారు. ఇంటి వద్దే పింఛన్లు పొందే వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడి సచివాలయానికి వెళ్లాల్సిన దుస్థితి తీసుకొచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ పరిపాలనను ఆదర్శంగా తీసుకుని పక్క రాష్ట్రాలు సైతం వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు పింఛన్ అందించడానికి ప్రతినెలా ఎంతోకొంత లంచం తీసుకునేవారని, ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా ప్రభుత్వ పథకాలన్నీ లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మళ్లీ జగన్నను ముఖ్యమంత్రి చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు అడపా రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు కుంచే స్వామి, ఎన్ఎస్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మహిళా విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ కోరుకొండ మంగాయమ్మ, కోరుకొండ కిరణ్, కుంపట్ల మహాలక్ష్మినాయుడు, సాకా కృష్ణ, కంఠంశెట్టి బుజ్జి, నల్లా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభపెడితే కఠిన చర్యలు

యానాం: ప్రస్తుతం జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎవరైనా ఆయా ఓటర్లను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని, జైలు శిక్ష సైతం తప్పదని పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారి జవహర్ గురువారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి, అతడి ఏజెంట్ ఏ ఓటరుకైనా ఓటువేయడానికి లేదా ఓటింగ్‌కు దూరంగా ఉండటానికి బహుమతులిస్తామంటూ ప్రేరేపించడం ప్రజాప్రాతినిధ్య చట్టం -1951లోని సెక్షన్ 123 ప్రకారం నేరమన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే సామాన్య ప్రజలు 1950 ఫోన్ నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

విద్యా విధానాలపై సమీక్ష

అమలాపురం టౌన్: విద్యా విధానాలపై స్థానిక యూటీఎఫ్ హోంలో గురువారం సాయంత్రం జరిగిన సమీక్షా సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యా రంగంపై ప్రతికూల పరిస్థితులు చూపుతున్న జీఓ 117ని తక్షణమే పునఃసమీక్షించాలని ఆయన డిమాండు చేశారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు, జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, కోశాధికారి సీహెచ్ కేశవరావు తదితరులు ప్రసంగించారు.

జనం మెచ్చేలా జగన్ పాలన


గేదెల్లంకలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు


గేదెల్లంకలో ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణలను సత్కరిస్తున్న ఎంపీపీ కోలా గంగా భవాని తదితరులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- అడుగడుగునా ప్రజల నీరాజనాలు

ముమ్మిడివరం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ప్రతి కుటుంబానికి నవరత్నాల పథకాలను అందించి జనం మెచ్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేశారని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం గేదిల్లంక, కొమానపల్లి, చినకొత్తలంక గ్రామాల్లో గురువారం ఆయన వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, యువత ఆయనకు అడుగడుగునా హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. ప్రజల వద్దకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని విద్య, వైద్య రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టారన్నారు. దేశ వ్యాప్తంగా విద్యారంగంలో మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. గేదిల్లంకలో ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ కోలా గంగా భవానీ, మోర్త రాణి మిరియాం జ్యోతి, జెడ్పీటీసీలు కుడిపూడి శంకరరావు, ముదునూరి సతీష్ రాజు, సర్పంచ్‌లు సానబోయిన పల్లయ్య, కాశి రామకృష్ణ, పొత్తూరి ఉమారాణి, నియోజకవర్గ పరిశీలకుడు అనుబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, మండల పార్టీ కన్వీనర్లు జగతా పద్మనాభం, పిన్నమరాజు వెంకటపతిరాజు, నల్లా నరసింహమూర్తి, కాదా గోవిందకుమార్, కోలా బాబ్జి, సొసైటీ అధ్యక్షులు పి.శ్రీనురాజు, పీటీవీ వర్మ, సాధనాల నూకరాజు, పి.వీరారాణి, బోణం చిన్ని, సానబోయిన మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప్ విజయానికి కృషి చేస్తాం


మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న కోనసీమ రజక సంఘం నేతలు

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ విజయానికి కృషి చేస్తామని కోనసీమ రజక సంఘం నేతలు ప్రకటించారు. గురువారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి విశ్వరూప్‌ను కలిసి వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపారు. అనంతరం రజక కార్పొరేషన్ డైరెక్టర్ బోర్రపాలెం సత్యనారాయణ, అమలాపురం సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం డైరెక్టర్ కోరిమిల్లి అనంతరావు, ఉప్పలగుప్తం మండల సంఘ అధ్యక్షుడు సామంతకుర్తి చిరంజీవి, పేరూరు శ్రీరాములు తదితరులు మంత్రిని సత్కరించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ


సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న పోలీస్ అబ్జర్వర్ అమర్‌దీప్‌సింగ్ రాయ్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలీస్ అబ్జర్వర్‌గా నియమితులైన ఐపీఎస్ అధికారి అమర్‌దీప్‌సింగ్ రాయ్ గురువారం యానాం-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన 10 చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్‌లను సైతం ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలిసారిగా యానాం వచ్చిన ఆయనకు ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు. 1994 ఐపీఎస్ కేడర్‌కు చెందిన అమర్‌దీప్‌సింగ్‌రాయ్ పంజాబ్‌లో అడిషనల్ డీజీపీగా ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

స్వీప్ జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు


ఈదరపల్లి వంతెన వద్ద అవగాహన ర్యాలీ చేస్తున్న స్వీప్ జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు

అమలాపురం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. అమలాపురం మండలం ఈదరపల్లి వంతెన వద్ద గురువారం ఓటర్లను చైతన్యం చేసేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం, ఎటువంటి ఒత్తిళ్లకు, వివాదాలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించడం స్వీప్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్య బలోపేతానికి దారితీస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, విలువైనదని అన్ని వర్గాల ప్రజలు తమ పవిత్రమైన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అమలాపురం ఎంపీడీఓ ఎ.లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ఓటర్లను చైతన్యవంతం చేసి అధిక శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడానికి స్వీప్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరగవలసిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్న నినాదాలతో కూడిన ఫ్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి టీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు సరెళ్ళ దుర్గాదేవి, సీహెచ్ వీరభద్రానందం, సత్తి సత్యకృష్ణ, పెచ్చెట్టి శ్రీనివాస్, సీఆర్ఎంటీలు, ఐటీ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల అవస్థలు

ఉప్పలగుప్తం: వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి మరీ అందించే పింఛన్లు ఈ నెల గ్రామ సచివాలయం వద్ద అందజేస్తుండడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం ఉదయం నుంచి ప్రతి పంచాయతీలోనూ పెన్షన్లు అందించారు. కొన్నిచోట్ల స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకు సిబ్బంది సకాలంలో నగదు చెల్లించక పింఛన్లు ఆలస్యమయ్యాయి. భానుడు నిప్పులు కక్కుతుండడంతో పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు వడగాల్పులకు తాళలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఇంటి వద్దకే పింఛను అందకుండా చేసిన పాపం చంద్రబాబుదేనని పలువురు వృద్ధులు మండిపడ్డారు. ఇంటి వద్దే పింఛన్లు పొందే తాము నానా అవస్థలు పడి సచివాలయానికి రావాల్సిన దుస్థితి తీసుకొచ్చారని దివ్యాంగులు ఆవేదన చెందారు. తమకు గత నాలుగున్నరేళ్లుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ అందించారని, ఎన్నికల నిబంధనల పేరుతో వలంటీర్లను మాకు పథకాలు ఇవ్వకుండా చేయడం బాధాకరమని వాపోయారు.


వానపల్లిపాలెం సచివాలయం వద్ద పింఛన్ కోసం వృద్ధుల పడిగాపులు


గొల్లవిల్లి సచివాలయంలో పింఛన్ కోసం లబ్ధిదారుల పాట్లు


కూనవరంలో పింఛన్ కోసం మండుటెండలో నడిచి వస్తున్న వృద్ధురాలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: స్థానిక వన్నెచింతలపూడి ఫీడర్, అమలాపురం కోర్టు ఫీడర్, ఎ.వేమరప్పాడు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు, విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ తెలిపారు. దీనివల్ల కామనగరువు, తాండవపల్లి, చిందాడగరువు, సమనస, వన్నెచింతలపూడి, సవరప్పాలెం, రెడ్డిపల్లి, ఎ.వేమవరం, భట్నవెల్లి తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

ప్రతి పంచాయతీకి కార్యదర్శి

గ్రామాల్లో ఇక నుంచి మరింత వేగంగా పాలన


అమలాపురం మండలంలోని తాండవపల్లి సచివాలయం

అమలాపురం రూరల్: ఏళ్లుగా ఇన్‌చార్జి కార్యదర్శుల ఏలుబడిలో సాగిన పంచాయతీ పాలన ఇక నుంచి పరుగులు పెట్టనుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో ఘన విజయం సొంతం చేసుకుంది. ప్రతి నాలుగైదు పంచాయతీలకు ఒక కార్యదర్శి విధులు నిర్వహించే పరిస్థితులు ఇప్పటివరకూ నెలకొన్నాయి. దీంతో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్వహణకు సిబ్బందికి, పాలక వర్గాలకు సమన్వయం కుదరక జాప్యం జరిగేది. ఈ సమస్యకు పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి నెల 15వ తేదీన జీవో నెంబరు 11 విడుదల చేసింది. దీని ప్రకారం 300 జనాభా పైబడిన ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఈ జీఓ అమలు దిశగా అడుగులు వేస్తున్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు. ప్రతి సచివాలయానికి 10 మంది ఉద్యోగులను నియమించి ప్రజలందరికీ స్థానికంగానే సేవలందేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా 300 జనాభా పైబడిన ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించాలన్న ఆదేశాలతో మరో అడుగు ముందుకేసినట్టైంది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని 22 గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగిస్తూ ఎంపిక ఉత్తర్వులు అందజేశారు. అమలాపురం మండలంలో తాండవపల్లి, పాలగుమ్మి, రెడ్డిపల్లి, సవరప్పాలెం, ఎ.వేమవరప్పాడు, జి.అగ్రహారం, అల్లవరం మండలంలో గుండెపూడి, సామంతకుర్రు, పల్లిపాలెం, ఎంట్రుకోన, రెల్లుగడ్డ, గోడితిప్ప, మొగళ్లమూరు, ముమ్మిడివరం మండలంలో మెర్లపాలెం, గాడిలంక, కర్రివానిరేవు, గేదెల్లంక, పల్లవారిపాలెం, కాట్రేనికోన మండంలో కొప్పిగుంట, కుండలేశ్వరం, లక్ష్మీవాడ, బంటుమిల్లి, ఐ.పోలవరం మండలం గోగులంక, పాతయింజరం గ్రామాల్లో గ్రేడ్-5 కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. ఈ చర్యల వల్ల పంచాయతీ పాలనలో అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేసే అధికారం ఆయా గ్రేడ్-5 కార్యదర్శులకు వస్తుంది. దీనివల్ల స్థానికంగా పాలన మెరుగవ్వడంతో పాటు ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికి దోహదపడుతుందని పలువురు అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు


గోపాలపురంలో జగ్గిరెడ్డిని కలసి రాజీనామా చేసిన జొన్నాడ వలంటీర్లు, నాయకులు

రావులపాలెం: జగనన్నను, జగ్గిరెడ్డి అన్నను గెలిపించుకోవడమే మా ధ్యేయం అంటూ ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన మొత్తం 39 మంది వలంటీర్లు, రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చదలవాడ శిరీష రాజీనామా చేశారు. గురువారం కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలోని స్వగృహం వద్ద వారు కలిశారు. జగ్గిరెడ్డి, జగనన్న గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్ చాపల సురేష్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ప్రతి పథకం లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించామన్నారు. ఉన్నత వర్గాల వారికి కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ అవసరం ఉన్నా సహాయపడ్డామన్నారు. చంద్రబాబు చర్యలతో నేడు పింఛను లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. ఎలక్షన్ కోడ్ ఉండగా మమ్మల్ని మీరేం చెయ్యలేరని బెదిరించేవారని, ఇప్పుడు రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి చిర్ల జగ్గిరెడ్డి, జగనన్న గెలుపునకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మరింతమంది రాజీనామాలు చేయనున్నారన్నారు. పొత్తు పార్టీలు తుడిచిపెట్టుకుపోతాయన్నారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రభుత్వం తరఫున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు తమ గెలుపునకు కృషి చెయ్యడానికి సిద్ధమైన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కట్టా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి (దొరబాబు), వైస్ ప్రెసిడెంట్ నాంద్ర నాగమోహనరెడ్డి, కట్టా రామకష్ణ, తాడి మెహర్ ఆదిత్యరెడ్డి, గొలుగూరి సూర్రెడ్డి, బొడ్డు సాయికుమార్ గుప్తా, కోమలి శ్రీను, బాలిన సూరయ్య, నక్కా రాజేష్, జక్కాల చిట్టిబాబు, వెలగల మౌళిప్రకాష్ రెడ్డి, సత్తి ప్రదీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజను కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో విశాఖజిల్లా ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారిని నియమించారు. అలాగే కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జిగా గుంటూరు రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రామారెడ్డి నియమితులయ్యారు.

బెస్ట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ వేణుగోపాలరావు

అమలాపురం రూరల్: స్థానిక సర్ సీవీ రామన్ పాఠశాలకు సుచిర్ ఇండియా ఫౌండేషన్ ద్వారా బెస్ట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు దక్కింది. పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని సత్యసాయి నిగమగమం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ రచయిత చంద్రబోస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఒలింపియాడ్‌లో విజేతగా నిలిచిన పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని కె.సౌమ్యకు బంగారు పతకాన్ని అందచేశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న స్కూల్ డైరెక్టర్ వేణుగోపాలరావును ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, హెచ్ఎం పెద్దిరాజు, రవణం చంటి, రవణం కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

తాగునీటి సమస్యపై ఫిర్యాదు

యానాం: నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంత గ్రామమైన సావిత్రినగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సావిత్రినగర్ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు గురువారం ఆర్ఏఓ మునిస్వామికి ఫిర్యాదు చేశారు. శివారు ప్రాంతాలకు గత కొద్దిరోజులుగా తాగునీరు అందడం లేదని ఏదో ఒక కుళాయి వస్తుంటే అక్కడికే వెళ్లి మహిళలు బిందెలు ద్వారా తెచ్చుకుంటున్నారన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకుని శివారు ప్రాంతాలకు సైతం తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.